సాక్షి అనకాపల్లి

సోమవారం । 20 । నవంబర్ । 2023



ప్రణాళిక ఉంటే విజయం మీదే

'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో గ్రూప్–1, 2 ఉద్యోగ పరీక్షలపై విశాఖలో ఆదివారం ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. 8లో



సాంకేతికతను అందిపుచ్చుకోండి

వైద్య రంగంలో వచ్చే అధునాతన వైద్య ప్రక్రియలు, విజ్ఞానాన్ని ఆకళింపు చేసుకోవాలని డాక్టర్ శశిప్రభ తెలిపారు. 8లో



ఘనంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

అప్పన్నను దర్శించుకున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ దినేష్‌కుమార్ శర్మ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దినేష్‌కుమార్‌శర్మ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను, జ్ఞాపికను అధికారులు అందజేశారు.

నేత్ర పర్వంగా గోవర్ధన పూజ



గోవర్ధన పర్వతం మోస్తున్న కృష్ణుడు

అనకాపల్లిటౌన్: స్థానిక మల్లిమఋగులవారివీధి హరేకృష్ణ మందిరంలో ఆదివారం గోవర్ధన పూజ నేత్రపర్వంగా జరిగింది. ఆవుపేడ, బంక మట్టితో తయారు చేసిన గోవర్ధన పర్వతం, గిరిరాజ్ కృష్ణుడు రూపాలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు గిరిరాజ్ భగవాన్‌కు 108 రకాల ఫలాలు నివేదించారు. ఈ కార్యక్రమంలో మందిర అధ్యక్షుడు దుర్లభ కృష్ణప్రేమ్‌దాస్ ప్రభూజీ గోవర్ధన లీల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మందిర కో ఆర్డినేటర్ మాతాజీ లావణ్య రంగదేవి, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సరుగుడు జలపాతం వద్ద సందర్శకుల సందడి



సరుగుడు జలపాతం వద్ద సందర్శకులు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకుల సందడి నెలకొంది. కార్తీక మాసం కావడంతో దూరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పిక్నిక్‌కు వచ్చారు. దీంతో ఈ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. ఎత్తైన కొండల మధ్యలోంచి ప్రవహించే నీటిలో సందర్శకులు జలకాలాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో గడిపారు. ఈ సందర్భంగా సంహపంక్తి భోజనాలు చేశారు. తాండవ రిజర్వాయర్ వద్దకూడా సందర్శకులు తాకిడి ఎక్కువగా ఉంది.

జాతీయస్థాయి తైక్వాండో సెలక్షన్స్‌కు ముగ్గురు విద్యార్థులు



మెడల్స్ సాధించిన బాలికలతో కోచ్ చందు

ఎస్.రాయవరం: మండలంలో అడ్డురోడ్డు తైక్వాండో క్లబ్‌కు చెందిన ముగ్గురు బాలికలు జాతీయ స్థాయి సెలక్షన్స్‌కు ఎంపికైనట్టు కోచ్ చందు ఆదివారం తెలిపారు. ఈ నెల 18,19 తేదీల్లో తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు ప్రతిభ కనబరిచినట్టు చెప్పారు. ఆర్.హసీనా, జ్యోత్నశ్రీ బంగారు పతకాలు, ఆర్.నందిని వెండిపతకం సాధించి జాతీయ స్థాయి పోటీల సెలక్షన్స్‌కు ఎంపికైనట్టు చెప్పారు. క్రీడాకారులను కోచ్ చందుతో పాటు అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

ఆశ కార్యకర్తలకు ఓబీఈ పరీక్ష

అనకాపల్లిటౌన్: స్థానిక వేల్పులవీధి జీవీఎంసీ బాలికోన్నత హైస్కూల్లో ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలకు ఓబీఈ పబ్లిక్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది ఉదయం జరిగిన పరీక్షకు 57 మందికిగాను 47 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 49 మందికిగాను 42 మంది హాజరైనట్టు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ చెప్పారు.

బహుజనుల గుండె చప్పుడు..
నలుదిశలా ప్రతిధ్వనించేలా..



యలమంచిలిలో వైఎస్సార్ విగ్రహం వద్ద బస్సు యాత్రపై పార్టీ నాయకులతో చర్చిస్తున్న బస్సు యాత్ర ఇన్‌చార్జి లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ సురేష్‌బాబు



అచ్యుతాపురంలో బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

- నేడు యలమంచిలి నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సుయాత్ర
- యలమంచిలి ఆర్టీసీ జంక్షన్ నుంచి అచ్యుతాపురం వరకు ర్యాలీ
- యలమంచిలి సీహెచ్‌సీ పరిశీలన
- అచ్యుతాపురం ఎంపీడీవో కార్యాలయం వద్ద భారీ బహిరంగ సభ
- పార్టీ శ్రేణుల్లో జోష్

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర సోమవారం యలమంచిలి నియోజకవర్గంలో జరగనుంది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి నేటి వరకు నాలుగున్నరేళ్ల పాలనలో జరిగిన సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించడమే ఈ యాత్ర ప్రధాన ఉద్దేశం. వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లోనూ సామాజిక న్యాయం పాటిస్తూ రాజకీయంగా, నామినేటెడ్ పదవుల్లోనూ, పార్టీలో అందరికీ సమన్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నారు. దేశంలోనే మరెక్కడా లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మేలు చేసింది. ఇప్పటికే జిల్లాలో తొలి విడతలో మాడుగుల, అనకాపల్లి నియోజకవర్గాల్లో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతమైంది. అదే తరహాలో సోమవారం యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు ఆధ్వర్యంలో జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రలో పార్టీ శ్రేణులు, యువత రెట్టింపు ఉత్సాహంతో భారీ ఎత్తున పాల్గోనున్నారు. ఈ యాత్రకు అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పీడిక రాజన్నదొర, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ హాజరు కానున్నారు. వీరికి ఉదయం 10 గంటలకు పార్టీ శ్రేణులు భారీ ఎత్తున స్వాగతం పలకనున్నారు. అనంతరం యలమంచిలిలో నిర్వహించే మీడియా సమావేశంలో వారు మాట్లాడతారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం బైక్ ర్యాలీతో అచ్యుతాపురంలోని పోలీస్ గ్రౌండ్‌లో బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారు.ఇప్పటికే బస్సు యాత్ర ఏర్పాట్లను ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తి రాజు, ఎమ్మెల్సీ, బస్సు యాత్ర ఇన్‌చార్జి లేళ్ల అప్పిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పరిశీలించారు.

సాధికార యాత్రతో జోష్

రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన మొదటి విడత బస్సు యాత్ర విజయవంతం కావడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం ఉరకలెత్తుతోంది. యాత్రకు రెట్టింపు ఉత్సాహంతో స్వాగతం పలికేందుకు యలమంచిలి నియోజకవర్గంలో యువత, పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల వారికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అన్ని సామాజిక వర్గాల వారికి రాజకీయ ప్రాధాన్యం కల్పించారు. ఈ నేపథ్యంలో చేసిన మంచిని ప్రజలకు వివరించేందుకు వైఎస్సార్ సీపీ సామాజిక సాధికారత పేరుతో బస్సుయాత్ర నిర్వహిస్తోంది.

బస్సు యాత్ర సాగుతుందిలా..

- ఉదయం 10.30 గంటలకు యలమంచిలిలో అతిథులకు స్వాగతం
- 11 గంటలకు యలమంచిలిలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ప్రెస్‌మీట్
- అనంతరం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకూ లంచ్
- 2 గంటల యలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు నివాళులర్పిస్తారు
- 2.15 గంటలకు యలమంచిలి సీహెచ్‌సీని మంత్రులు పరిశీలిస్తారు
- అనంతరం 15 కిలోమీటర్ల మేర అచ్యుతాపురం వరకు బైక్ ర్యాలీ.
- మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం సాయంత్రం 5 గంటల వరకు పోలీస్ గ్రౌండ్‌లో బహిరంగ సభ

సాధికార యాత్రను విజయవంతం చేయండి : ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

యలమంచిలి నియోజకవర్గంలో జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను ప్రజలంతా విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రాజకీయాలు, మతాలకు అతీతంగా అన్ని వర్గాల వారికీ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలందించారన్నారు. రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఉప ముఖ్యమంత్రులతో పాటు కీలక మంత్రుల పదవులు కల్పించారని చెప్పారు. కార్పొరేషన్ పదవుల్లో 60 శాతానికి పైగా బీసీలకు అవకాశం కల్పించారని తెలిపారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేనివిధంగా నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సామాజిక న్యాయం జరిగిందని తెలిపారు. యలమంచిలి నియోజకవర్గంలో బీసీలు, ఎస్సీలు ఎక్కువగా ఉన్నారు. నేడు జరగనున్న సామాజిక బస్సు యాత్రకు వారంతా వేలాదిగా హాజరు కానున్నారని ఎమ్మెల్యే తెలిపారు.

● సరస్వతీ నిలయాలకు కొత్తరూపు

- లోపలి పేజీల్లో



ఇది కదా అభివృద్ధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను అత్యంత ప్రాధాన్యత రంగాలుగా ఎంచుకుంది. నాడు–నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేసి ఉన్నత ప్రమాణాలు కల్పించింది. దీంతో జిల్లాలో సరస్వతీ నిలయాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌ను తలదన్నేలా మౌలిక వసతులు సమకూరాయి. అందుకు అనుగుణంగా విద్యాప్రమాణాలు కూడా మెరుగుపడ్డాయి. దీంతో చక్కటి ఫలితాలు సాధిస్తున్నాయి.

దేశానికే ఆదర్శంగా సీఎం జగన్



మామిడిపల్లిలో అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, చిత్రంలో ఎంపీ సత్యవతి

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు
- మామిడిపల్లిలో పండగలా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం
- వైఎస్ రాజశేఖరరెడ్డి, అంబేడ్కర్, బుద్ధుడి విగ్రహాల ఆవిష్కరణ



వైఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం బూడి, ఎంపీ సత్యవతి

దేవరాపల్లి: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి నిలిచారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మామిడిపల్లిలో స్థానిక సర్పంచ్ కర్రి సూరినాయుడు, జెడ్పీటీసీ కర్రి సత్యం ఆధ్వర్యంలో సుమారు రూ.1.25 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు ఆదివారం పండగ వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమాలకు హాజరైన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి ఎంపీ బి.వి. సత్యవతి, జిల్లా గ్రంథాలయ చైర్ పర్సన్ కొండా రమాదేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ తదితరులకు కోలాటం, తీన్‌మార్ వాయిద్యాల నడుమ గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు మరిడిమాంబ, నూకాంబిక అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. రూ.60 లక్షలతో నిర్మించిన ఇంటింటికీ కుళాయిలు, మంచినీటి ట్యాంక్‌ను, రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు ప్రారంభించారు. రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఎంపీ సత్యవతి, పౌర గ్రంథాలయ శాఖ భవనాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి ప్రారంభించారు. మామిడిపల్లి సచివాలయ పరిధిలోని మామిడిపల్లి, తిమిరాం పంచాయతీలలో సీఎం జగన్ నాలుగున్నరేళ్లలో పాలనలో రూ.12.83 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా చేపట్టిన వివరాలతో కూడిన శిలాఫలకాన్ని డిప్యూటీ సీఎం, ఎంపీ ప్రారంభించారు. అనంతరం మహానేత దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి,డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, గౌతమ బుద్ధుడు విగ్రహాలను డిప్యూటీ సీఎం ఆవిష్కరించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బూడి మాట్లాడుతూ మహనీయుల స్ఫూర్తితో సీఎం జగన్ విప్లవాత్మక నిర్ణయాలతో గ్రామ స్థాయిలోనే ప్రజలకు అన్ని సేవలను అందిస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు ఉరుకుటి అప్పారావు, కొండా రాజీవ్ గాంధీ, స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం, దేవరాపల్లి, కె.కోటపాడు ఎంపీపీలు కిలపర్తి రాజేశ్వరి, రెడ్డి జగన్‌మోహన్, మాడుగుల జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, దేవరాపల్లి, మాడుగుల, చీడికాడ వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, తాళ్లపురెడ్డి రాజారామ్, గొల్లవిల్లి రాజుబాబు, కురచా నారాయణమూర్తి, లాలం జానకీరామ్, వైస్ ఎంపీపీలు చింతల బుల్లి లక్ష్మీ, ఉగ్రాకుల గంగాభవానీ, రొంగలి నారాయణమ్మ, స్థానిక సర్పంచ్ కర్రి సూరినాయుడు, ఎంపీటీసీ పంచాడ సింహాచలం నాయుడు, తిమిరాం సర్పంచ్ రెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్టీసీ 'కార్తీక' స్పెషల్స్

- శైవ క్షేత్రాల దర్శనం.. పిక్నిక్ స్పాట్స్‌కు ప్రత్యేక సర్వీసులు



పంచారామాల యాత్ర బస్సులను ప్రారంభించిన విశాఖ జిల్లా డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ

అల్లిపురం/డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ) విశాఖపట్నం రీజియన్ పంచారామక్షేత్ర దర్శిని, కార్తీకమాసం వనసమారాధనల నేపథ్యంలో లంబసింగి, అరకు, ధారమతానికి ప్రత్యేక సర్వీసులు నడపనుందని ప్రజారవాణాఅధికారి అప్పలరాజు తెలిపారు.

పంచారామాలకు బస్సులు ప్రారంభం

హైందవ సంప్రదాయంలో కార్తీక మాసానికి విశేష ప్రాముఖ్యత ఉంది. లయకారుడైన ఆ పరమశివుని కార్తీక మాసంలో, అందునా సోమవారం రోజున దర్శిస్తే సకల పాపాలు హరిస్తాయని ప్రతీతి. అందువల్ల ఈ నెల 14 నుంచి కార్తీక మాసం ప్రారంభమైన దృష్ట్యా విశేష పర్వదినాలైన సోమవారం రోజున 5 ప్రముఖ శైవక్షేత్రాలు దర్శించేలా పంచారామ క్షేత్ర దర్శినిని ఆర్టీసీ ప్రవేశపెట్టింది. పంచారామాల సందర్శనకు మూడు బస్సులను ఆదివారం సాయంత్రం ద్వారకా బస్ స్టేషన్‌లో విశాఖ జిల్లా డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, ద్వారకా బస్ స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ హెచ్.అమరసింహుడు, విశాఖపట్నం డిపో మేనేజర్ గంగాధర్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒకే రోజు అమరావతి (అమరేశ్వరుడు), భీమవరం (భీమేశ్వరుడు), పాలకొల్లు (క్షీర రామలింగేశ్వరుడు), ద్రాక్షారామం (భీమలింగేశ్వరుడు), సామర్లకోట (కుమార రామలింగేశ్వరుడు) దర్శించుకునే విధంగా ప్యాకేజీ రూపంలో ఏపీఎస్ ఆర్టీసీ రూపొందించిందన్నారు. ప్రతి ఆదివారం సాయంత్రం ద్వారకాబస్ స్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సుకు ఒక్కొక్కరికి రూ.2,100, అల్ట్రా డీలక్స్ బస్సు రూ.2,050 నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం డిపో అసిస్టెంట్ మేనేజర్ పి.శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

ఏఏ రోజుల్లో..

కార్తీకమాసంలో వచ్చే అన్ని ఆదివారాలు..అనగా ఈ నెల 19, 26, డిసెంబర్ 3, 10 తేదీల్లో సాయంత్రం 5 గంటలకు విశాఖ ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయి. ప్రయాణచార్జీ (ఒక్కరికి) సూపర్‌లగ్జరీ రూ.2,100, అల్ట్రా డీలక్స్..రూ.2050

లంబసింగి టూర్..

కార్తీకమాసం పురస్కరించుకొని పిక్నిక్‌ల సందడి దృష్ట్యా ఆర్టీసీ లంబసింగికి ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఈ బస్సులు శని, ఆదివారాల్లో ఉదయం 3 గంటలకు ద్వారకా బస్టేషన్ నుంచి బయలుదేరుతాయి. లంబసింగి, తాజంగి డ్యామ్, కొత్తపల్లి వాటర్‌ఫాల్స్, మోదమాంబ గుడి (పాడేరు), కాఫీ తోటలు వీక్షించేలే ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. ప్రయాణచార్జీ (ఒక్కరికి) అల్ట్రాడీలక్స్ రూ.800, ఎక్స్‌ప్రెస్:రూ.650

అరకు టూర్

కార్తీకమాసం పురస్కరించుకొని ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 6 గంటలకు ద్వారకాబస్టేషన్ నుంచి బస్సులు నడపనున్నారు. డముకు వ్యూ పాయింట్, గాలికొండ వ్యూ పాయింట్, చాపరాయి, పద్మాపురం గార్డెన్స్, ట్రైబల్ మ్యూజియం చూపించనున్నారు. ప్రయాణ చార్జీ (ఒక్కరికి) అల్ట్రా డీలక్స్ రూ.800, ఎక్స్‌ప్రెస్..రూ.650

ధారమఠం

కార్తీక మాసంలో వచ్చే ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 7 గంటలకు ద్వారకాబస్టేషన్ నుంచి సర్వీసులు నడపనుంది. శివాలయం, ధారమఠం వాటర్ ఫాల్స్, అల్లూరి సీతారామరాజు మ్యూజియం, బొజ్జన్నకొండ (అనకాపల్లి). ప్రయాణచార్జీ (ఒక్కరికి) అల్ట్రా డీలక్స్..రూ.650, ఎక్స్‌ప్రెస్..రూ.550.

మరిన్ని వివరాలకు..

టికెట్స్ ముందుగా బుక్ చేసుకోదలచే వారు ఏపీఎస్‌ఆర్టీసీ.ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. లేదా ద్వారకాబస్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్ లో బుక్ చేసుకునే సౌకర్యం కల్పించారు. లేదా 9959225602, 7382921540, 9959225594, 9100109731, 7382914219, 9959221199 నంబర్లలో సంప్రదించవచ్చు.

మోదకొండమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



మోదకొండమ్మను దర్శించుకోవడానికి అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలను శిరస్సున పెట్టుకుని బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి కార్తీక ఆదివారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. అనకాపల్లి, విశాఖపట్నం, నర్సీపట్నం, రావికమతం తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలను శిరస్సున పెట్టుకుని అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఉచితంగా ప్రసాదం, తాగు నీరు అందించింది.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన శ్రీకాంత్‌వర్మ

మాకవరపాలెం : బైక్‌ను మరో బైక్ ఢీకొట్టిన ఘనటలో ఒక యువకుడు మృతి చెందాగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. విజయనగరానికి చెందిన మందపాటి శ్రీకాంత్‌వర్మ (32) ఆదివారం తెల్లవారుజామున నర్సీపట్నంలోని బంధువుల ఇంటికి మోటార్ సైకిల్‌పై వస్తున్నాడు. మండలంలోని రామన్నపాలెం జంక్షన్ సమీపంలోనికి వచ్చేసరికి ఎదురుగా బైక్‌పై వస్తున్న విశాఖ జిల్లా మల్కాపురం గ్రామానికి చెందిన మంగి మురళి(33) ఢీకొట్టాడు. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడగా, వారిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. అయితే శ్రీకాంత్‌వర్మ పరిస్థితి విషమించడంతో మరణించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు.

గాయకుడు ధీరజ్ క్రీడా సామగ్రి వితరణ



విద్యార్థినులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న గాయకుడు ధీరజ్, సన్యాసిపాత్రుడు

నర్సీపట్నం: మున్సిపాలిటీ బీసీ కాలనీలో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బాలసదనానికి పాడుతా తీయగా విన్నర్ బాల గాయకుడు ధీరజ్ వైట్ బోర్డు, క్యారం బోర్డు వితరణ చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడుతో కలిసి ఆదివారం బాలసదనాన్ని సందర్శించాడు. అక్కడ వందేమాతరం పాటతో అలరించారు. బాలికలతో కలిసి సదనం ఆవరణలో మొక్కలు నాటి, పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సన్యాసిపాత్రుడు మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే గాయకుడిగా పేరు తెచ్చుకోవడమే కాకుండా సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ధీరజ్‌ను ఆదర్శంగా తీసుకుని నచ్చిన రంగంలో రాణించాలని విద్యార్థినులకు సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కుమార్‌బాబు, బాలసదనం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికతో సిద్ధమైతే విజయం మీదే..



అవగాహన సదసుకు హాజరైన విద్యార్థులు, ఉద్యోగార్థులు



మాట్లాడుతున్న బాలలత

- తలరాత మారేలా కసితో చదవాలి
- పోటీ పరీక్షలపై సివిల్స్ విజేత బాలలత సూచనలు
- 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో గ్రూప్‌-1, 2 అవగాహన సదస్సుకు విశేష స్పందన



శ్రీకాకుళం నుంచి వచ్చిన దంపతులు

విశాఖ విద్య: 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో గ్రూప్‌–1, 2 ఉద్యోగ పరీక్షలపై విశాఖలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి విద్యార్థులు, ఉద్యోగార్థులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. హైదరాబాద్ సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్, సివిల్స్ విజేత బాలలత గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు. త్వరలోనే గ్రూప్స్ నోటిఫికేషన్ రానున్నందున పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో తెలిపారు.

ఒత్తిడి జయిస్తేనే విజయం

పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, ఉద్యోగార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఒత్తిడికి గురికావొద్దన్నారు. గ్రూప్స్ పరీక్షలు మనం ఎదుర్కోగలమా అనే అనుమానం మనస్సులో నుంచి పూర్తిగా తీసేయాలన్నారు. పోలియో కారణంగా కాళ్లకు సమస్య వచ్చినందున మరో వ్యక్తి సాయమందిస్తేనే ప్రయాణం సాగే పరిస్థితుల్లో, చదువుతోనే నా తలరాత మార్చుకున్నానన్నారు. హైదరాబాద్‌లో కోచింగ్ సెంటర్‌కు వెళితే, సివిల్స్ నీ వల్ల అవుతుందా అని అవమానాలకు గురిచేశారని, ఆ కసితోనే 2004లో సివిల్స్ ఆలిండియా 399వ ర్యాంకు, 2016లో 167వ ర్యాంకు సాధించానని చెప్పారు. చదువు నిరంతర ప్రక్రియ అని, చదువుతోనే మన తలరాత మార్చుకోవాలని సూచించారు. మన లైఫ్‌ను మనమే తీర్చిదిద్దుకొని సమాజానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారాలన్నారు. ప్రణాళికాబద్ధమైన ప్రిపరేషన్‌తో ముందుకెళితే విజయం మీదేనన్నారు. పలువురు విద్యార్థులు, అభ్యర్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు మాట్లాడుతూ పలు దపాలుగా గ్రూప్స్ పరీక్షలు రాసి, నాలుగు ఉద్యోగాలకు ఎంపికయ్యాయని, పట్టుదలతో చదివితే ఏదైనా సాధించవచ్చన్నారు. సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఇలాంటి సదస్సు ఏర్పాటు చేయటం హర్షనీయమని అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు అన్నారు.

బాలలత సూచనల్లో కొన్ని..

- ప్రతీ రోజూ 7 నుంచి 8 గంటల పాటు చదువు కోవాలి. 2 నుంచి 3 గంటల పాటు మోడల్ పేపర్లు ప్రాక్టీస్ చేయాలి.
- భారీ మెటీరియల్ జోలికి వెళ్లకుండా, సొంత నోట్స్ సిద్ధం చేసుకోవాలి. పోటీ పరీక్షల్లో వచ్చే ప్రశ్నల స్థాయి ఏటేటా పెరుగుతుండటంతో అందుకు అనుగుణంగా సిద్ధం కావాలి.
- సామాజిక అంశాలపై కచ్చితమైన అవగాహన ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే సంక్షేమ పథకాలపై కూడా అధ్యయనం చేయాలన్నారు.
- ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి అంశాలపై పట్టుసాధించాలి.
- గ్రూప్స్‌లో అబ్జెక్టివ్ విధానం అమల్లోకి వస్తున్నందున, తక్కువ సమయంలో పరీక్షను ఎదుర్కొనేలా ప్రాక్టీస్ చేయాలి.





నోట్సు రాసుకుంటున్న విద్యార్థులు

సాక్షికి కృతజ్ఞతలు



ప్రైవేటు ఫార్మా కంపెనీతో పనిచేస్తూ, గ్రూప్స్‌కు సిద్ధమవుతున్నాను. బాలలత మేడమ్ క్లాస్ వినాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాను. సాక్షి మీడియా వారు ఇలాంటి సదస్సు ఏర్పాటు చేయటం వల్ల నాలాంటి వారికి ఎంతో ఉపయోగం. సాక్షి మీడియాకు కృతజ్ఞతలు.

– బి.వి.రవీంద్ర, కూర్మన్నపాలెం, విశాఖపట్నం

విలువైన సదస్సు



నేను పాడేరులో స్త్రీ శిశు సంక్షేమశాఖలో ఈవోగా పనిచేస్తున్నాను. గ్రూప్స్‌లో విజయం సాధించి రెవెన్యూలో మంచి పోస్టు కొట్టాలనేది లక్ష్యం. బాలలత మేడమ్ సదస్సుకు వస్తున్నారని తెలిసి వచ్చాను. ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. సాక్షి మీడియా వారు విలువైన సదస్సు ఏర్పాటు చేశారు.

–రెడ్డి విమల, చోడవరం, అనకాపల్లి జిల్లా

ఎంతో ఉపయోగం



బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసి, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాను. బాలలత మేడమ్‌ను తీసుకొచ్చి, మాలాంటి వారికి అవసరమైన సూచనలు, సలహాలు ఇప్పించిన సాక్షి మీడియా వారికి ధన్యవాదాలు. ఇలాంటి సదస్సుల వల్ల ఎంతో ఉపయోగం.

– యు.సనత్‌కుమార్, విశాఖపట్నం

ఎన్నో విషయాలు తెలుసుకున్నాను



బీటెక్ చదువుతున్నాను. గ్రూప్స్‌కు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నాను. సాక్షి మీడియా వారు ఏర్పాటు చేసిన సదస్సుల్లో ఎన్నో విషయాలు తెలుసుకున్నారు. చదువుకునే సమయంలోనే ఇలాంటి సదస్సులకు హాజరవ్వటం వల్ల ఎంతో ఉపయోగం

– బి.మహేశ్వరి, తాటిచెట్లపాలెం, విశాఖ

చక్కగా వివరించారు



చోడవరం సచివాలయంలో ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాను. సాక్షి మీడియా ఆధ్వర్యంలో బాలలత మేడమ్‌తో గ్రూప్స్‌పై సదస్సు ఏర్పాటు చేస్తున్నారని తెలిసి వచ్చాను. గ్రూప్స్ గురించి చక్కగా వివరించారు. గ్రూప్స్‌లో విజయం సాధించాలనేది నా లక్ష్యం.

– ఆర్.మానస, చోడవరం, అనకాపల్లి జిల్లా

సామాజిక సాధికార యాత్ర బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

అచ్యుతాపురం(అనకాపల్లి): సామాజిక సాధికారత బస్సు యాత్రలో భాగంగా అచ్యుతాపురంలో సోమవారం నిర్వహించనున్న బహిరంగ ఏర్పాట్లను వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు ఆదివారం పరిశీలించారు. యలమంచిలి నుంచి చేపట్టనున్న బస్సు యాత్ర కార్యక్రమాలు, బహిరంగ సభ ప్రాంగణాలను వీరు పరిశీలించారు. శాసన మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కన్నబాబు రాజు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేశ్ బాబు, నవరత్నాల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, యలమంచిలి నియోజక వర్గ సమన్వయ కర్త రొంగలి జగన్నాథం, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కో ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, కోన లచ్చన్నాయుడు, దేశం శెట్టి శంకర్‌రావు పాల్గొన్నారు.

యాత్రను విజయవంతం చేయాలి

యలమంచిలి(అనకాపల్లి రూరల్): యలమంచిలి నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ, సామాజిక బస్సు యాత్ర ఇంఛార్జ్ లేళ్ల అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. యాత్ర ఏర్పాట్లను ఆయన ఆదివారం సమీక్షించారు. యలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద వైఎస్సార్ విగ్రహాన్ని పరిశీలించిన ఆయన స్థానిక పార్టీ నేతలతో బస్సు యాత్ర ఏర్పాట్లపై చర్చించారు. బైక్ ర్యాలీకి ఎంతమంది పార్టీ కార్యకర్తలు రానున్నారో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, పట్టణ అధ్యక్షుడు బొద్దపు ఎర్రయ్యదొరలతో చర్చించారు. అనంతరం బస్సు యాత్ర రూటు, షెడ్యూల్ గురించి చర్చించారు. ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌బాబు, పార్టీ మండలాధ్యక్షుడు కొల్లి త్రినాథ్, పార్టీ నాయకుడు మర్రి రాజు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ కేంద్రంగా 'విశాఖ ఇగ్నో'



అవార్డు అందుకుంటున్న ఇగ్నో విశాఖ డైరెక్టర్ ధర్మారావు

ఎంవీపీ కాలనీ: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) విశాఖపట్నం కేంద్రం జాతీయ స్థాయిలో ఉత్తమ కేంద్రంగా ఎంపికైంది. ఈ మేరకు ఇగ్నో విశాఖ ప్రాంతీయ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఢిల్లీలో జరిగిన 38వ ఇగ్నో వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ ఇగ్నో కేంద్రం డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్‌కుమార్ సక్సేనా చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 2023 ఏడాదికి గాను ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు, నగర ప్రముఖులు ఇగ్నో విశాఖ అధికారులకు అభినందనలు తెలిపారు.

జగన్‌ను మరోసారి సీఎంగా గెలిపించుకోవాలి

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



ఎమ్మెల్సీ అప్పిరెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, పార్టీ శ్రేణులు

మునగపాక: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి కోరారు. యలమంచిలిలో సోమవారం నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర ఏర్పాట్లను పరిశీలించేందుకు ఆయన వచ్చిన సందర్భంగా ఆదివారం మునగపాకలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ సారథ్యంలో పలువురు నాయకులు శాలువాతో సత్కరించారు. సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, భీశెట్టి గంగప్పలనాయుడు, బొడ్డేడ శ్రీనివాసరావు, పార్టీ నేతలు దాసరి అప్పారావు, దొడ్డి వరహా సత్యనారాయణ, నరాలశెట్టి సూర్యనారాయణ, ఇల్లా నాగేశ్వరరావు, శరగడం జగన్నాథరావు పాల్గొన్నారు.

ఉత్తర వాహిని.. ముక్తిదాయిని

- పిక్నిక్ స్పాట్‌గా మారిన చమ్మచింత
- ఏటా కార్తీకమాసంలో సందర్శకుల తాకిడి



సీతారాముల విగ్రహాలు



రావణుడు సీతను అపహరించుకుపోయిన ఘట్టం తెలిపే విగ్రహం



తాండవ నది ఒడ్డున శివాలయం

నాతవరం: కోరిన కోర్కెలు తీర్చే చమ్మచింత రామలింగేశ్వరుడు ఆలయం ఉత్తర వాహినిగా భాసిల్లుతోంది. ఇక్కడ ఒక వైపు ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతుండగా, మరోవైపు ఆహ్లాదకరమైన వాతావరణం అనుకూలంగా ఉండటంతో పిక్నిక్ స్పాట్‌గా మారింది. ఏటా కార్తీక మాసంలో చమ్మచింత సమీపంలో తాండవ నదీ తీరాన నిర్మించిన శివాలయానికి సందర్శకుల తాకిడి అధికంగా ఉంటోంది. ఈ శివాలయం ప్రాంగణంలో సీతారాముల విగ్రహాలతోపాటు పలువురు దేవుళ్ల ప్రతిమలు ఏర్పాటు చేశారు. రావణుడు సీతను అపహరించుకుపోయే ఘట్టం, ఆంజనేయస్వామి రాముడు పాదాలకు నమస్కరిస్తూ అభివాదం చేసిన విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. ఇక్కడ తాండవ నదీ నీరు ఉత్తర దిశగా ప్రవహిస్తోంది. దాంతో ఉత్తర వాహినిగా ఈ ప్రాంతంలో పేరు గాంచింది. కార్తీకమాసంలో మహిళలు తాండవ నదీలో స్నానమాచరించి శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తుంటారు. గతంలో ఈ ప్రాంతీయులు నర్సీపట్నం మండలం బలిఘట్టం వద్ద ఉత్తరవాహినిలో స్నానమాచరించేందుకు వెళ్తుండేవారు. చమ్మచింత వద్ద తాండవ నదీ ఒడ్డున శివాలయం నిర్మించడంతోపాటు ఇక్కడకు నాతవరం, కొయ్యూరు మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వస్తున్నారు. ఇక్కడ అరటి, మామిడి తోటలతోపాటు చల్లటి వాతావరణంలో కనుచూపు మేర పచ్చని పొలాల ఉండటంతో సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. క్రమేణా పిక్నిక్ స్పాట్‌గా మారడంతో ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వాహనాలపై వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడుపుతుంటారు. నర్సీపట్నం నుంచి ఇక్కడకు 22 కిలోమీటర్ల మేర దూరం ఉంటుంది. నర్సీపట్నం డిపో నుంచి తాండవ వరకు ఆర్టీసీ బస్సు నడుస్తోంది. ఈ బస్సులో వచ్చే వారు చమ్మచింత జంక్షన్‌లో దిగి గ్రామంలోని శివాలయానికి చేరుకోవాలి. తర్వాత తాండవ జంక్షన్‌తోపాటు నాతవరం నుంచి నిత్యం ఆటోలు ఉంటాయి.

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోండి



రిటైర్డు డీఎంఈ డాక్టర్ శశిప్రభతో ప్రసూతి, గైనకాలజిస్టులు

మహారాణిపేట: వృత్తి పరంగా వైద్య రంగంలో వచ్చే అధునాతన వైద్య ప్రక్రియలు, విజ్ఞానాన్ని ఆకళింపు చేసుకోవాలని విశ్రాంత డీఎంఈ డాక్టర్ ఆర్.శశిప్రభ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం అబ్‌స్ట్రాక్ట్ అండ్ గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ విశాఖపట్నం 56వ వార్షిక నిరంతర వైద్య విద్యా(సీఎంఈ) కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శశిప్రభ మాట్లాడుతూ ప్రసూతిలో అనేక నూతన, అధునాతన వైద్య పోకడలు వస్తున్నాయని, వాటి పట్ల ప్రసూతి వైద్యులు అవగాహన కలిగి ఉండాలన్నారు. సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ వి.సీతారామరాజు మాట్లాడుతూ నూతన పద్ధతుల మీద అవగాహన కలిగించేందుకు సీఎంఈ తరచూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. సొసైటీ కార్యదర్శి డాక్టర్ అల్లూ నిహారిక ఈ ఏడాది చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్ట్రాక్ట్ అండ్ గైనకాలజికల్ సొసైటీ(ఎఫ్‌వోజీఎస్ఐ) దక్షిణ విభాగ ఉపాధ్యక్షురాలు డాక్టర్ సంపత్ కుమారి, కేజీహెచ్ క్యాన్సర్ విభాగాధిపతి డాక్టర్ శిల్ప, పలువురు ప్రసూతి వైద్యులు పాల్గొన్నారు.

ఐఎన్ఎస్ డేగాలో విద్యార్థులు



చేతక్ హెలికాప్టర్ గురించి వివరిస్తున్న నేవీ అధికారులు

గోపాలపట్నం: నేవీ డే పురస్కరించుకుని నగరంలో ఏడు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఆదివారం ఐఎన్ఎస్ డేగా, నేవల్ ఎయిర్‌స్టేషన్‌ను సందర్శించారు. ఇక్కడ చేతక్ ఎయిర్ క్రాఫ్ట్ పని చేసే విధానం, ఏరియల్ సెర్చ్, రెస్క్యూ ఆపరేషన్ ఏ విధంగా చేస్తారో నేవీ అధికారులు విద్యార్థులకు వివరించారు.

అగ్నికుల క్షత్రియులకు సముచిత స్థానం

- ఎంపీ మోపిదేవి వెంకటరమణ



అగ్నికుల క్షత్రియ కార్మిక వన సమారాధనలో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణ

అక్కిరెడ్డిపాలెం: అగ్నికుల క్షత్రియులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యున్నత పదవులు కేటాయించిందని ఎంపీ మోపిదేవి వెంకటరమణ అన్నారు. ఆదివారం గ్లోబెక్స్ సమీపంలోని జిల్లా అగ్నికుల క్షత్రియ కార్తిక వన మహోత్సవాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అగ్నికుల క్షత్రియులు సామాజిక వర్గం అత్యంత బలంగా ఉందన్నారు. మరో అతిథి గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీసీలకు సముచిత స్థానం ఉందన్నారు. సామాజిక భవన నిర్మాణానికి 500 గజాల స్థలం కేటాయించాలిన మోపిదేవి, ఎమ్మెల్యే నాగిరెడ్డికి అగ్నికుల క్షత్రియులు వినతిపత్రం అందజేశారు. అనంతరం సంక్షేమ సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంటక్ కార్పొరేషన్ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బర్రి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శాంతారామ్, సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బర్రి మురళీకృష్ణ రాజు, కార్యనిర్వాహక కార్యదర్శి వరదాడ వెంకటరమణ, మాజీ మేయర్ పులుసు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి



కొయ్యూరు స్టేషన్‌ను సందర్శిస్తున్న డీఐజీ హరికృష్ణ, ఆయనతో చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్

కొయ్యూరు: వచ్చే ఏడాది సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి పూర్తి వివరాలు సేకరించాలని విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ ఆదేశించారు. ఆదివారం కొయ్యూరు ,మంప పోలీసుస్టేషన్లను చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిషోర్‌తో కలిసి సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలను గుర్తిస్తే దాని ఆధారంగా భద్రత కల్పించేందుకు వీలు కలుగుతుందన్నారు. సారా తయారీ నిరోధంపై దృష్టి సారించాలని సూచించారు.గిరిజనులకు మరింత చేరువ అయ్యేందుకు వీలుగా కమ్యూనిటీ పోలీసింగ్‌ను విస్తరించాలని ఆదేశించారు.

క్లుప్తంగా

మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ



టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలతో సమితి సభ్యులు

అనకాపల్లిటౌన్ : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న భగవాన్ సత్యసాయిబాబా మందిరంలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో జరుగుతున్న టైలరింగ్ ఫ్యాషన్ టెక్నాలజీ శిక్షణ రెండో బ్యాచ్ వారికి ఆదివారంతో ముగిసిందని సమితి జిల్లా అధ్యక్షుడు వైశ్యరాజు కృష్ణరాజు చెప్పారు. టైలరింగ్‌లో 29 మందికి శిక్షణ పూర్తయిందని, వారందరికీ సర్టిఫికెట్లు అందించామన్నారు. సమితి జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి అన్నం రాజశేఖర్, సమితి కన్వీనర్ రామ్మూర్తి, సాయిలక్ష్మి, కామరాజు, భారతి పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

అనకాపల్లి రూరల్ : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఈ నెల 27,28 తేదీల్లో విజయవాడలో జరగనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకర్రావు కోరారు. ఆదివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు కేంద్రం విధానాలను ఎండగట్టారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు, అధ్యక్షుడు కర్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీపీటీవో కార్యక్రమం నేడు

అనకాపల్లిటౌన్ : స్థానిక ప్రజా రవాణా శాఖ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీపీటీవో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి కె.పద్మావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8639431199 నంబర్‌కు ఫోన్ చేసి సంస్థ అభివృద్ధికి సలహాలు, సూచనలు అందించాలని ఆమె కోరారు.

రేపు మినీ జాబ్ మేళా

తుమ్మపాల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా అచ్యుతాపురం ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 21న పరవాడలో గల రిఫ్రా టెక్నిక్ కంపెనీ మినీ జాబ్ మేళా నిర్వహిస్తునట్టు సంస్థ జిల్లా అధికారి టి. చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ (ఫిట్టర్, వెల్డర్, మెకానికల్, ఎలక్ట్రికల్) అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 7036363272 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆటల పోటీల నిర్వహణలో శిక్షణ

తుమ్మపాల : 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం నిర్వహణలో భాగంగా జిల్లాలో 522 గ్రామ, వార్డు సచివాలయాల్లోని వలంటీర్లకు ఆటల నిర్వహణలో శిక్షణ ఇచ్చినట్లు జి.ఎస్.డబ్ల్యు.ఎస్. ప్రత్యేక అధికారి మంజులవాణి ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో పోటీల నిర్వహణకు విధి విధానాలు, అంపైరింగ్ అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

మై నేమ్ ఈజ్ శృతి	: రాజా
మా ఊరి పొలిమేర-2	: సత్యనారాయణస్క్రీన్-1
స్పార్క్	: సత్యనారాయణస్క్రీన్-2
జిగర్‌తండ	: షిర్డిసాయి
కీడా కోలా	: పర్తిసాయి
-------	: వెంకటేశ్వర
టైగర్-3	: శ్రీసత్య
మంగళవారం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 21 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. 'ఎ' పాజిటివ్-4 యూనిట్లు, 'బి' పాజిటివ్-5 యూనిట్లు, 'బి' నెగెటివ్-1 యూనిట్, 'ఒ' పాజిటివ్-6 యూనిట్లు, 'ఎబి' పాజిటివ్-5 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 278 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 346 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ స్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.





సర్కార్ బడి... సరికొత్త ఒరవడి

నూతన ఆకాంక్షలు, కొత్త అవకాశాలు ఒక్క విద్యాభివృద్ధితోనే సాధ్యమవుతుందని నమ్మారు.. పేద కుటుంబాలకు చెందిన బాలలూ వారిలో ఉన్న మేధాశక్తిని గ్రహించడానికి, నైపుణ్యాలకు పదును పెట్టడానికి.. తమను తాము ఉన్నతులుగా తీర్చి దిద్దుకోడానికి అడుగులు పడేలా... 'బడి'బుడి అడుగులతోనే భవిష్యత్తు సుదీర్ఘ ప్రయాణం ప్రభావవంతంగా సాగేలా దారులు తీర్చిదిద్దారు. పాఠశాలలు ఉన్నతంగా ఉండేలా... తద్వారా ఉన్నతమైన ఆలోచనలు విద్యార్థులకు కలిగేలా మౌలిక సదుపాయాలు కల్పించి..వారి మేలైన భవితకు పునాదులు వేశారు.. ప్రభుత్వ బడంటే ఈసడింపు స్థాయి నుంచి వహ్వా.. అనేలా రూపురేఖలు మార్చారు.. విద్యార్థుల ఆలోచనలు మహోన్నతంగా ఉండేలా పునాదులు వేశారు... వెరసి కార్పొరేట్ పాఠశాలలను మించి ప్రభుత్వ బడులను తీర్చి దిద్దారు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి..

ఇది కాదా అభివృద్ధి అంటే...
ప్రగతి అంటే...



నా పేరు కాము శివజ్యోతి. మా అమ్మాయి రూప తుమ్మపాల హైస్కూల్‌లో ఆరో చదువుతోంది. గతంలో డైనింగ్ హాల్ లేకపోవడంతో చెట్ల కింద కూర్చొని మధ్యాహ్నం భోజనం చేసేది. అన్నంలో దుమ్ముధూళి ఎగిరిపడేవి. చెట్ల ఆకులు, ఒక్కోసారి పక్షుల రెట్టలు కంచెంలో పడేవి. అప్పుడు మా పాప భోజనం చేయకుండా ఆకలితోనే ఉండేది. దీంతో పాఠాలు సరిగా అర్థమయ్యేవి కావు. నాడు-నేడు పథకంలో డైనింగ్ హాలు నిర్మించారు. దీంతో ఎటువంటి ఇబ్బంది లేకుండా కడుపునిండా భోజనం చేస్తోంది. పాఠశాల ప్రహరీగోడ, ముఖ ద్వారానికి ఐరన్ గేటు ఏర్పాటు చేయడంతో ఇప్పుడు ఎటువంటి భయం లేదు.



నా పేరు ముత్తా లక్ష్మి. మాది అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామం. మధ్య తరగతి కుటుంబం. మా అబ్బాయి సంతోష్ పట్టణంలో ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదివేవాడు. గతంలో తుమ్మపాల హైస్కూల్ బూత్‌బంగ్లాను తలపించేది. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలతో పాటు నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చింది. దీంతో రెండేళ్ల కిందట తుమ్మపాల హైస్కూల్లో మా అబ్బాయిని చేర్పించాం. ఇప్పుడు ఇక్కడ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యతగల విద్య బోధిస్తున్నారు. ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్నాడు. నా కుమారుడికి స్కూల్ యూనిఫాం తోపాటు పౌష్టికాహారం అందిస్తున్నారు.

మారేడుపూడి హౌసింగ్‌కాలనీ ఎంపీపీ పాఠశాల

అభివృద్ధి చెందిన ప్రాథమిక పాఠశాలలు

- మెట్టపాలెం, తగరంపూడి, ఊడేరు, దిబ్బపాలెం, మామిడిపాలెం, పాపయ్యసంతపాలెం, కొండుపాలెం, మాకవరం, మార్టూరు, బవులువాడ, సీతానగరం, వెంకుపాలెం, పిసినికాడ, తుమ్మపాల-1, డీబీ కాలనీ, కొత్తతలారివానిపాలెం, కొత్తూరు, కొండకొప్పాక, మారేడుపూడి, తారకరామకాలనీ, గాంధీనగరం, గవరపాలెం, ఉడ్‌పేట జీవీఎంసీ.

ప్రాథమికోన్నత పాఠశాలలు

- శంకరం, ఎరుకువానిపాలెం, సుందరయ్యపేట, కుంచంగి, కూండ్రం, రామాపురం, గురజాడనగర్, కోడూరు, గోపాలపురం.

ఉన్నత పాఠశాలలు

- జీవీఎంసీ పెద హైస్కూల్, జీవీఎంసీ చిన హైస్కూల్, గవరపాలెం(బాలికలు), వేల్పులవీధి (బాలికలు), గాంధీనగరం, కొండకొప్పాక, మామిడిపాలెం, సీతానగరం, కూండ్రం, తుమ్మపాల.

అనకాపల్లిటౌన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలతో పాటు పాఠశాలల ఆవరణలో క్రీడామైదానాలు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. తరగతిలో నాణ్యత గల విద్య బోధించేందుకు సమర్థులైన ఉపాధ్యాయులను నియమించారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద ఇలా పలు సంక్షేమ పథకాలు అమలు చేసి విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నారు. బైజూస్ లాంటి సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని ట్యాబ్‌లు అందజేశారు. దీంతో తల్లిదండ్రులు, పిల్లలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



అనకాపల్లి పట్టణం, మండలంలో మొత్తం 107 ప్రభుత్వ పాఠశాలల్లో 85 పాఠశాలలు అభివృద్ధి చెందాయి. మరో 22 పాఠశాలల్లో అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయి. తొలివిడతలో 42 పాఠశాలలు, రెండో విడతలో-2లో 43 పాఠశాలలు పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి.



కోడూరు ఎంపీపీ పాఠశాల

నాడు-నేడులో చేపట్టిన పనులు

ప్రహరీల నిర్మాణం, మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయం, విద్యార్థులు కూర్చునేందుకు బల్లలు, ఆకర్షణీయమైన బొమ్మలు, పెయింట్స్, తరగతి గదుల్లో స్మార్ట్ టీవీల ఏర్పాటు.

అభివృద్ధి ఇలా...

అనకాపల్లి టౌన్, మండలంలో మొత్తం స్కూళ్లు	107
నాడు నేడులో ఎంపిక చేసినవి	85
తొలివిడతలో అభివృద్ధి చేసినవి	42
నాడు-నేడు రెండో దశలో ఎంపికైనవి	43
వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నవి	22

స్కూళ్ల కేటగిరీ	సంఖ్య	వ్యయం రూ. కోట్లలో
ప్రాథమిక పాఠశాలలు	23	4.32
ప్రాథమికోన్నత పాఠశాలలు	09	1.81
ఉన్నత పాఠశాలలు	10	5.48

టాయిలెట్ ఇబ్బంది తప్పింది



గతంలో టాయిలెట్‌కు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉండేది. అత్యవసర సమయాల్లో మేం పడే అవస్థలు అన్నీఇన్నీ కావు. ఇప్పుడా బాధతప్పింది. నాడు-నేడు పథకంలో టాయిలెట్లు నిర్మించడంతో సౌకర్యంగా ఉంది. – గాలి పూజిత, 10వ తరగతి విద్యార్థిని, తుమ్మపాల హైస్కూల్



స్వయంప్రతిపత్తితోనే బీసీల అభివృద్ధి



యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రత్నాకర్, బీసీ సంక్షేమ సంఘం సభ్యులు

అనకాపల్లిటౌన్ : బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బీసీల రాజ్యాధికారం కోసం చేపట్టే రథయాత్ర పోస్టర్‌ను స్థానిక లక్ష్మీనారాయణనగర్ డీవీఆర్ కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ ఆవిష్కరించారు. బీసీలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలని కోరుతూ డిసెంబర్ 7న శ్రీకాకుళం నుంచి పెద్దఎత్తున ఈ యాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో బీసీ కులాలన్నీ ఐక్యతతో రథాయాత్రను విజయవంతం చేయాలని కోరారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.వెంకట రమణ యాదవ్, జాతీయ కన్వీనర్ వై.నాగేశ్వరరావు, సంఘ సభ్యులు కొణతాల అప్పలరాజు, భర్నికాన బాబూరావు, భరిన్లికాన నర్సింహమూర్తి, బంధం వెంకటరమణ, నాగంశెట్టి వెంకటేశ్వరరావు, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, వియ్యపు సింహాచలం పాల్గొన్నారు.

బీసీలకు రాజకీయాల్లో ప్రాతినిధ్యం కల్పించాలి..

బీసీలకు అసెంబ్లీ, పార్లమెంట్లలో స్థానం కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంకట రమణ యాదవ్ అన్నారు. ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. 90 అసెంబ్లీ, 13 పార్లమెంట్ స్థానాలకు రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ



అభాగ్యులకు దుప్పట్లు అందిస్తున్న తాతాజీ



పేదలకు దుప్పట్లు అందిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్ : పట్టణంలో రహదారుల పక్కన నిద్రిస్తున్న 93 మంది అభాగ్యులను గుర్తించి వారికి శనివారం రాత్రి జేడీ ఫౌండేషన్ సభ్యులు దుప్పట్లు కప్పారు. శారదా నది వంతెన, బస్టాండ్, నెహ్రూచౌక్, రైల్వేస్టేషన్ వద్ద చలిలో నిద్రిస్తున్న వారికి దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి నుదురుపాటి తాతాజీ రాత్రంతా అభాగ్యులను గాలించేందుకు సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

జాప్ ఆధ్వర్యంలో..

అనకాపల్లిటౌన్ : స్థానిక నెహ్రూచౌక్‌లో నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్టు అనుబంధ సంస్థ (జాప్) జిల్లా యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎంపీ బీవీ సత్యవతి ముఖ్య అతిథిగా హాజరై వార్షికోత్సవ కేక్ కట్ చేసి పేదలకు దుప్పట్లు, పండ్లు, రొట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాంద్రేగుల విష్ణుమూర్తి, పట్టణ ఎస్ఐ సత్యనారాయణ, అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరావు, గౌరవాధ్యక్షుడు సాయిరాం, ప్రధాన కార్యదర్శి రమేష్, అధికసంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం



అగ్రహారంలో డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన నాయకులు

కశింకోట : స్థానిక అగ్రహారం వీధిలో డ్రైజేజీ నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంజూరు చేసిన నిధులతో సుమారు అర కిలోమీటర్ పొడవున డ్రైనేజీ నిర్మించనున్నట్లు పనులను ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు.

అభివృద్ధి వివరాల బోర్డు ఆవిష్కరణ నేడు

కశింకోట : మండలంలోని తేగాడ సచివాలయంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై రూపొందించిన బోర్డు ఆవిష్కరణ కార్యక్రమం జరగనుందని ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తరలి రావాలని కోరారు.

దివంగత ప్రధాని ఇందిరకు నివాళి



కశింకోట గ్రంథాలయంలో ఇందిరాగాంధీకి నివాళులర్పిస్తున్న వైస్ ఎంపీపీ జ్యోతి

అనకాపల్లిటౌన్/కశింకోట : కశింకోటలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం మహిళా దినోత్సవం నిర్వహించారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి కె. వరలక్ష్మి, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, బాలికల హైస్కూలు విద్యా కమిటీ అధ్యక్షుడు యల్లపు శ్రీనివాసరావు, రిటైర్డు టీచర్ యల్లపు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. తాళ్లపాలెం గ్రంథాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో దివంగత ప్రధాని ఇందిరా గాంధీ చిత్ర పటానికి డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి. గ్రేసీ పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు కుర్చీలాట, ముగ్గుల పోటీలు నిర్వహించారు. నృత్య కార్యక్రమం ప్రదర్శించారు. గురుకుల పాఠశాల గ్రంథాలయ అధికారి ఎం. భారతి, ఉపాధ్యాయులు, శాఖా గ్రంథాలయం అధికారి కె. జగన్నాథం పాల్గొన్నారు.

ఉత్తమ ప్రిన్సిపాల్‌కు సత్కారం..

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు పీజే నాయుడు హాజరై ఇందిర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకు ముందు ఉత్తమ మహిళా ఉద్యోగి బుచ్చెయ్యపేట కస్తూర్భాగాంధీ బాలికల విద్యాలయ ప్రిన్సిపాల్ కోసూరి అన్నపూర్ణను ఘనంగా సత్కరించారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం..

దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహానేత ఇందిరాగాంధీ అని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఐఆర్ గంగాధర్ అన్నారు. గాంధీనగరం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఇందిర జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో..

కశింకోటలో దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కార్యదర్శులు కత్తెర శ్రీధర్, కట్టమూరి నూకఅప్పారావు, అనకాపల్లి అసెంబ్లీ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు మల్లపురెడ్డి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ మ్యాచ్ వీక్షణ



పట్టణంలో ఎల్‌ఈడీ స్క్రీన్లపై మ్యాచ్ తిలకిస్తున్న క్రీడాభిమానులు

అనకాపల్లిటౌన్ : భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న ఫైనల్ మ్యాచ్‌ను పట్టణంలో పలు చోట్ల ఎల్‌ఈడీ స్క్రీన్‌లపై క్రికెట్ అభిమానులు ఆదివారం వీక్షించారు. భీశెట్టి అప్పారావు కల్యాణ మండపం, కొణతాల శివరామయ్య ఇంటి వినాయక ఆలయం ముందు భారత్ విజయం సాధించాలని ఉత్కంఠంగా మ్యాచ్‌ను తిలకించారు.

కనకమహాలక్ష్మి వీధిలో..

కశింకోట : స్థానిక కనకమహాలక్ష్మి వీధిలో పెద్ద తెరపై భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారాన్ని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. యువకులు, స్థానికులు హాజరై ఈ మ్యాచ్‌ను తిలకించారు.